ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 | సంచిక: 366 తిరుపతి | తేది : శనివారం 28 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | ధర : రూ.6 | PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS

బొత్స అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను

- బొత్స త్వరగా కోలుకోవాలన్న పవన్ కల్యాణ్
- ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థన
- ఓ ప్రకటన విడుదల చేసిన డిప్యూటీ సీఎం

అమరావతి - ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27

వైసీపీ మాజీ మంత్రి, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు వార్తలు రావడం తెలిసిందే. దీనిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. బొత్స సత్యనారాయణ త్వరగా కోలుకోవాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. "శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ త్వరగా ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షిస్తున్నాను. బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారని తెలిసి బాధపడ్డాను. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు అందించాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను" అని తన ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ ఏడాది చివరికి 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు చేస్తాం

- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన
- ఈ ఏడాది డిసెంబర్ నాటికి 10 లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అందజేత
- నిరుపేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఉచితం
- రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయాభివృద్ధికి ఐదు సూత్రాల అమలు
- లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద కోకో సిటీ ఏర్పాటు

అమరావతి - ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27

రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నేడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గృహ నిర్మాణం, వ్యవసాయ శాఖల పద్దులపై జరిగిన చర్చలో సీఎం ప్రసంగించారు. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 10 లక్షలకు పైగా ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిపిస్తామని ఆయన సభలో ప్రకటించారు. ఇప్పటికీ ఇళ్లు లేని నిరుపేదలు ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

2029 నాటికి అందరికీ ఇళ్లు

రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే తమ ధ్యేయమని సీఎం తెలిపారు. రాయచోటి నుంచి ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించామని, ఈ ఏడాది ఉగాది నాటికి దాదాపు 3 లక్షల

- మిగతా 2లో..

రెడ్ బుక్‌లో జగన్ పేరు ఉందో, లేదో త్వరలో తెలుస్తుంది

- గత ప్రభుత్వంలో తప్పులు చేసిన అధికారులు, నాయకులను వదిలిపెట్టేది లేదన్న లోకేశ్
- తిరుమల లడ్డూ కల్తీపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు క్షమాపణ
- చిన్నారుల సోషల్ మీడియా వాడకంపై 90 రోజుల్లో బలమైన ఫ్రేమ్‌వర్క్
- 75 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు 25 ఏళ్ల యువకుడిలా పనిచేస్తారని ప్రశంస

అమరావతి - ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27

ముంబయిలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా - 2026' సదస్సులో ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పలు కీలక అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా, గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారి పేర్లతో తాను నిర్వహిస్తున్న 'రెడ్ బుక్'లో మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరు ఉందో లేదో త్వరలోనే తెలుస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో తమ పార్టీ కార్యకర్తలను, నాయకులను, సాధారణ ప్రజలను అక్రమ కేసులతో తీవ్రంగా వేధించారని లోకేశ్ ఆరోపించారు. చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులు, వారిని ప్రోత్సహించిన రాజకీయ నాయకులు, చిత్రహింసలకు గురిచేసిన వారి పేర్లను రెడ్ బుక్‌లో నమోదు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, తప్పు చేసిన ప్రతి ఒక్కరూ శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరించారు. అయితే, ఈ జాబితాలో జగన్ పేరు ఉందా లేదా అనే విషయంపై ఉత్కంఠ రేపుతూ, ఆ విషయం త్వరలోనే

- మిగతా 2లో..

ఏపీలో పాలు, నీళ్లు కూడా ప్రాణాంకతమే

- చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వరుస మరణాలని జగన్ ఆరోపణ
- శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనలతో డజనుకు పైగా మృతి చెందారని వెల్లడి
- గత 14 నెలల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆవేదన
- ప్రభుత్వం వెంటనే మేల్కొని చర్యలు చేపట్టాలని డిమాండ్

అమరావతి - ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలి పోయిందని, చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాగే నీరు, పాలు కూడా ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారాయని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్న డయేరియా, కల్తీ పాల మరణాలు ప్రభుత్వ వైఫల్యానికి నిలువుటద్దమని ఆయన విమర్శించారు. పరిపాలనపై పట్టుకోల్పోయిన పాలకులు, ప్రతిపక్షంపై బురద చల్లడం, కక్ష సాధింపులపైనే దృష్టి పెట్టారని, ప్రజల ప్రాణాలను గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు. గత వారంలోనే శ్రీకాకుళంలో కలుషిత నీటి కారణంగా డయేరియా ప్రబలి ఐదుగురు మరణించగా, 200 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారని జగన్ గుర్తుచేశారు. అదే వారంలో రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది వెంటిలేటర్లపై ప్రాణాలతో పోరాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషణ ఇవ్వాల్సిన పాలు, దాహం తీర్చాల్సిన నీళ్లు ప్రాణాలు తీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత 14 నెలల్లో రాష్ట్రంలోని హాస్టళ్లు, విద్యాసంస్థల్లో సుమారు 25 ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగాయని,

- మిగతా 2లో..

ఉత్తరాంధ్రకు మరో భారీ ఔషధ తయారీ కంపెనీ..

- నేడు నారా లోకేశ్ చేతులమీదుగా శంకుస్థాపన
- రాంబిల్లి సెజ్‌లో బ్లూ జెట్ హెల్త్‌కేర్
- రూ.2,300 కోట్ల పెట్టుబడితో భారీ పరిశ్రమ
- ఈ ప్రాజెక్టు ద్వారా 1,750 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు
- మొత్తం 102.48 ఎకరాల భూమిని కేటాయించిన ప్రభుత్వం

అమరావతి- ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికల్లో భాగంగా మరో భారీ పరిశ్రమ ఏర్పాటవుతోంది.

- మిగతా 2లో..

అమరావతి రైల్వే లైన్‌కు నిధులు

2047 కోట్లు.. 57కిమీ దూరం..!

విజయవాడ- ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27

రైల్వే డిపార్ట్మెంట్, ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న అమరావతి రైల్వే లైన్ కోసం తెలంగాణ రైతుల నుంచి భూసమీకరణ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ -తెలంగాణ బోర్డర్‌లోని ఎర్రుపాలెం గ్రామం పరిధిలోని రైతులు అమరావతి రైల్వే లైన్ కోసం భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఇప్పటికే దీనికోసం రైల్వే అధికారులు ఎర్రుపాలెం

గ్రామస్తులతో పలు దఫాలు చర్చలు జరుపగా దాదాపు అందరూ ఒప్పుకొన్నట్టు అక్కడి స్థానికుడు, అడ్వకేట్ శ్రీనివాస్ తెలిపారు. నిజానికి ఈ ప్రాజెక్ట్‌లో సంక్లిష్టమైన భాగం

- మిగతా 2లో..

ఆప్కోకు స్కోచ్ అవార్డు

- మంత్రి సవిత

అమరావతి- ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27

ఆప్కోలో డిజిటిలైజేషన్ విధానం అమలుకు స్కోచ్ అవార్డు లభించిందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో చేనేత రంగ అభివఅద్ధికి పెద్ద పీట వేస్తూ వస్తోందని శుక్రవారం ఒక

- మిగతా 2లో..

రెడ్ బుక్‌లో జగన్ పేరు ఉందో, లేదో త్వరలో తెలుస్తుంది

(మొదటిపేజీ తరువాయి)

అది సాధిస్తే 18 కిలోల బరువు మోయమంటారని, దీనికి అంతం ఉండదని అన్నారు. ఆయన ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయడమే తమ పని అని తెలిపారు. 75 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు 25 ఏళ్ల యువకుడిలా పనిచేస్తారని, ఆయన టేబుల్ వద్దకు తీసుకొచ్చే శక్తి అమోఘమని ప్రశంసించారు. "క్వాంటమ్ కంప్యూటింగ్ గురించి ఒక మీటింగ్‌లో చంద్రబాబు అడిగినప్పుడు, స్టాన్‌ఫోర్డ్ ఎంబీఏ చదివినా నాకు దానిపై అవగాహన లేదు. నేను టేబుల్ కింద ఫోన్‌లో చాట్‌జీపీటీలో వెతుక్కోవాల్సి వచ్చింది. ఆయన ఆలోచనలను అందుకోవడం చాలా కష్టం" అని లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు.

లడ్డూ కల్తీపై క్షమాపణ.. కఠిన చర్యలు

తిరుమల లడ్డూ ప్రసాదం అంశాన్ని లోకేశ్ తీవ్రంగా పరిగణించారు. 2019-24 మధ్య లడ్డూ తయారీలో పెద్ద ఎత్తున కల్తీ జరిగిందని, రసాయనాలు వాడారని అంగీకరించారు. జగన్ హయాంలో జరిగిన ఈ అపచారానికి, రాష్ట్ర మంత్రిగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజానికి క్షమాపణ చెబుతున్నట్లు ప్రకటించారు. లడ్డూ ప్రసాదంతో భక్తులకు ఉన్న భావోద్వేగ బంధాన్ని గుర్తుచేశారు. ఈ కల్తీకి బాధ్యులైన వారిని, సిట్ నివేదిక ప్రకారం మాజీ టీటీడీ చైర్మన్‌తో సహా ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలు చేయడానికి ఎవరైనా వెయ్యి సార్లు ఆలోచించేలా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తిరుమలలో ప్రపంచ స్థాయి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

సోషల్ మీడియా, జాతీయ అంశాలపై..

చిన్నారులపై సోషల్ మీడియా ప్రభావం గురించి మాట్లాడుతూ, 11 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను పూర్తిగా దూరంగా ఉంచాలని, 16 ఏళ్లలోపు వారికి వయసుకు తగిన కంటెంట్ మాత్రమే అందుబాటులో ఉండాలని నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. దీనిపై 90 రోజుల్లో బలమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఇక జాతీయ అంశాలపై స్పందిస్తూ, ఢిల్లీలో జరిగిన ఏఐ సదస్సులో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందని విమర్శించారు. తాము ఎప్పుడూ రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను స్వాగతించామే తప్ప, గత ప్రభుత్వాల మాదిరిగా అడ్డుకోలేదని స్పష్టం చేశారు. యూఎస్ ట్రేడ్ డీల్ గందరగోళ సమయంలో సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకుని ఆక్వా రైతులకు అండగా నిలిచామని, కొత్త మార్కెట్లను అన్వేషించామని తెలిపారు.

ఏపీలో పాలు, నీళ్లు కూడా ప్రాణాంకతమే

(మొదటిపేజీ తరువాయి)

వీటి వల్ల 15 జిల్లాల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని జగన్ వివరించారు. కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో తాజాగా 16 మంది విద్యార్థినులు డయేరియాతో అస్వస్థతకు గురయ్యారని, గతంలో ఇదే పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మరణించినా ప్రభుత్వం పాఠాలు నేర్చుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులను జాతీయ మీడియా సైతం ఎండగడుతోందని తెలిపారు. గడచిన 18 నెలల్లో చేబ్రోలు, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం వంటి అనేక ప్రాంతాల్లో డయేరియా ప్రబలి వందలాది మంది అస్వస్థతకు గురై, డజన్ల కొద్దీ మరణాలు సంభవించాయని జగన్ ఆరోపించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపానికి స్పష్టమైన నిదర్శనమన్నారు. ఆహార భద్రత, సురక్షిత నీటి సరఫరా వంటి కనీస బాధ్యతలను కూడా ప్రభుత్వం విస్మరించిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మేల్కొని, రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి చిత్తశుద్ధితో పరిస్థితిని సమీక్షించాలని జగన్ డిమాండ్ చేశారు. లోపాలను గుర్తించి సరిదిద్దాలని, సురక్షిత నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చాలని, ఆహార భద్రత పర్యవేక్షణను కఠినంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వం నుంచి అద్భుతాలు కోరుకోవడం లేదని, మరిన్ని ప్రాణాలు పోకముందే మేల్కొని, తగిన చర్యలు చేపట్టాలని మాత్రమే ఆశిస్తున్నారని జగన్ పేర్కొన్నారు.

తెలంగాణలో రెండో సీటుపై
కాంగ్రెస్ ఉత్కంఠ

- రాజ్యసభ ఎన్నికలపై కాంగ్రెస్ ప్రత్యేక కసరత్తు
- సామాజిక సమీకరణాల కన్నా 'ఫైర్‌పవర్' ఉన్న నేతలకే ప్రాధాన్యం
- పలు రాష్ట్రాల్లో సీట్ల కోసం తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్న ఆశావహులు
- అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానందే తుది నిర్ణయం

హైదరాబాద్ – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27

పది రాష్ట్రాల్లోని 37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈ ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు గెలుచుకోవడం ఖాయంగా కనిపిస్తుండగా, కాంగ్రెస్ పార్టీకి కేవలం ఐదు సీట్లు దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, పరిమిత సంఖ్యలో ఉన్న స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈసారి సామాజిక సమీకరణాల కంటే, ప్రభుత్వానికి గట్టిగా గళం వినిపించే 'ఫైర్‌పవర్' ఉన్న నేతలకే పెద్దపీట వేయాలని పార్టీ అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్‌కు రెండు సీట్లు దక్కే అవకాశం ఉండటంతో ఇక్కడ పోటీ ఆసక్తికరంగా మారింది. ఒక రాజ్యసభ స్థానం గెలవాలంటే 40 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాంగ్రెస్‌కు 66 మంది సొంత ఎమ్మెల్యేలతో పాటు, ఒక లెఫ్ట్, ఏడుగురు ఎంఐఎం ఎమ్మెల్యేల మద్దతుతో బలం 74కు చేరింది. దీంతో ఒక సీటు సులభంగా గెలుచుకోనుంది. అయితే, రెండో సీటు కోసం బీఆర్ఎస్‌తో గట్టి పోటీ తప్పకపోవచ్చు. బీఆర్ఎస్‌కు 36 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 8 మంది ఉన్నారు. ఇక్కడి నుంచి సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఒక స్థానం కోసం టీఎస్ సింగ్ డియో, మోహన్ మార్కం వంటి దాదాపు 20 మంది నేతలు పోటీ పడుతున్నారు. హరియాణాలో కూడా ఒకే సీటు ఉండటంతో రాజ్ బబ్బర్, పవన్ ఖేరా, సుప్రియా శ్రీనతే వంటి వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు సీనియర్ నేత ఆనంద్ శర్మ వైపు మొగ్గు చూపుతుండగా, మాజీ సీఎం వీరభద్ర సింగ్ భార్య ప్రతిభా సింగ్ కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం కాంగ్రెస్ అధిష్ఠానానిదే. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చర్చించి ఈ వారాంతంలోగా అభ్యర్థుల జాబితాను ఖరారు చేసే అవకాశం ఉంది. దీంతో ఎవరికి అవకాశం దక్కుతుందనే దానిపై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

ఈ ఏడాది చివరికి 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్లలో లబ్ధిదారులు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ నాటికి మరో 2.26 లక్షలు, సెప్టెంబర్ నాటికి ఇంకో 2.10 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు పూర్తి చేస్తామని స్పష్టమైన ప్రణాళికను వివరించారు. 2029 నాటికి రాష్ట్రంలోని పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించడంతో పాటు, అర్హులైన వారికి ఉచితంగా ఇంటి స్థలాలు కూడా పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థలాన్ని కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2.20 లక్షల కుటుంబాలకు సొంత జాగా లేదని గుర్తించామన్నారు.

అక్రమార్కులపై ఉక్కుపాదం

గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ రంగం, ఇసుక విధానాల్లో జరిగిన అవినీతిపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేదల ఇళ్ల పేరుతో గత పాలకులు భారీగా అక్రమాలకు పాల్పడ్డారని, ఇసుక విధానాన్ని అస్తవ్యస్తం చేసి దోచుకున్నారని ఆరోపించారు. ఈ కుంభకోణాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తాయని తెలిపారు.

వ్యవసాయానికి 'పంచ సూత్రాల' ఊతం

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం 'పంచ సూత్రాల' విధానాన్ని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. అగ్రిటెక్, నీటి భద్రత, డిమాండ్ ఉన్న పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా రైతులను ఆదుకుంటామని చెప్పారు. వ్యవసాయంలో యాంత్రీకరణతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలను కూడా రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని సీఎం గుర్తుచేశారు. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.14,000, కేంద్రం వాటాగా రూ.6,000 కలుపుకుని పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 47 లక్షల మంది రైతులకు రెండు విడతల్లో రూ.6,309 కోట్లు జమ చేశామని, గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,670 కోట్లు కూడా తామే చెల్లించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని, ఇప్పటివరకు రూ.10,816 కోట్లు చెల్లించామని వివరించారు. ఉచిత విద్యుత్ కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.13,722 కోట్లు కేటాయించామని, ఈ ఏడాది కొత్తగా 69 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని చెప్పారు.

రాయలసీమ ఇక ఉద్యాన హబ్

రాష్ట్రంలో ఉద్యానవన, ఆక్వా రంగాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు రూపొందించామని చంద్రబాబు తెలిపారు. రాయలసీమను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రూ.30 వేల కోట్లతో క్లస్టర్ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రైవేటు పెట్టుబడులతో కలిపి మొత్తం రూ.1 లక్ష కోట్లతో సీమ రూపురేఖలు మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం 400 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తులను 1000 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచడమే లక్ష్యమన్నారు. అలాగే, ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద 'కోకో సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం సంచలన ప్రకటన చేశారు. నీటి భద్రతపై తీసుకున్న చర్యల వల్ల అన్నమయ్య జిల్లాలో భూగర్భ జలాలు 6.67 మీటర్ల మేర పెరిగాయని, రాష్ట్ర సగటున 7.31 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. దీనివల్ల రూ.95 కోట్ల విలువైన విద్యుత్ ఆదా అయ్యిందని చెప్పారు. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని, సాగునీటి సంఘాలను బలోపేతం చేసి రైతన్నకు భరోసా కల్పిస్తామని సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

అమరావతి రైల్వే లైన్‌కు నిధులు

(మొదటిపేజీ తరువాయి)

తాము ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. ఈ అనుసంధాన ప్రాజెక్టు వల్ల రెండు తెలుగు రాష్ట్రాలకూ మేలు జరుగుతుందని ఆయన అన్నారు. గురువారం నాడు శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

మే 15కే నారుమళ్లకు నీళ్లు

రాష్ట్రంలో నీటి భద్రతకు కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిశ్రమలు, పెట్టుబడులకు నీరే కీలకమని అన్నారు. రాష్ట్రంలోని జలాశయాల్లో ప్రస్తుతం 793 టీఎంసీల నీరు నిల్వ ఉందని, అందుకే ఈసారి పంటల సీజన్‌ను ముందుకు జరిపి, వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళిక రచించా మని ప్రకటించారు. ఈ విషయంపై రైతులను చైతన్యవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు. ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తన లక్ష్యమని, దీనికోసం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై త్వరలోనే ఒక బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడించారు.

ప్రాజెక్టులన్నీ మా హయాంలో కట్టినవే

రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టులన్నీ తమ హయాంలోనివేనని పడినట్టు అయింది. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం గ్రామానికి శాతాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడికి సమీపంలో ఉన్న జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయం చాలా పురాతనమైంది. ఇక్కడికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అయినప్పటికీ ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌లో పెద్దగా రైళ్లు ఆగవు. విజయవాడ -భద్రాచలం రోడ్డు మెము, విజయవాడ -డోర్నకల్ ప్యాసింజర్, గోల్కొండ ఎక్స్ ప్రెస్, కృష్ణా ఎక్స్ ప్రెస్ మాత్రమే ఇక్కడ రోజూ ఆగుతాయి. ఈ నాలుగు కాకుండా వారానికి రెండుసార్లు ప్రయాణించే చెన్నై -లక్నో ఎక్స్ ప్రెస్‌కి ఈ స్టేషన్‌లో హాల్ట్ ఉంది. చాలా రోజులుగా ఎర్రుపాలెం సహా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పద్మావతి, శాతవాహన, విజయవాడ -సికింద్రాబాద్ ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్‌లను ఎర్రుపాలెం స్టేషన్‌లో ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ అది ఒక డిమాండ్ గానే ఉండిపోతూ వచ్చింది. అమరావతి బైపాస్ రైల్వే లైన్ ఈ స్టేషన్ నుంచే ప్రారంభం అవుతుందని రైల్వే ప్రకటించడంతో ఎర్రుపాలెం వాసుల మైండ్‌లో కొత్త ఆశలు చిగురించాయి. ఈ లైన్ వల్ల ఎర్రుపాలెం స్టేషన్ హోదా మారి జంక్షన్ అవుతుంది. దానివల్ల అమరావతి వైపు వెళ్లే కొత్త రైళ్ళతోపాటు ఆల్రెడీ ఉన్న కొన్ని అదనపు రైళ్ళకు కూడా ఈ స్టేషన్‌లో హాల్టింగ్ ఇచ్చి తీరాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఊరు కూడా డెవలప్ అవుతోందని ఇక్కడి రైతులు భావిస్తున్నట్టు రెడ్డి అనే మరో గ్రామస్తుడు తెలిపారు. మొదట కాస్త ఇబ్బందిగా ఫీల్ అయినా మూడు నాలుగు దఫాల మీటింగ్స్ తర్వాత తమ భూములు కొత్త రైల్వే లైన్ కోసం ఇవ్వడానికి ఇక్కడి రైతులు ఒప్పుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న భూములు మార్కెట్ ధరలకు మూడు రెట్లు పరిహారం లభించనున్నట్టు కొందరు గ్రామస్తులు తెలిపారు. భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తమ భూములను ఇవ్వడానికి వీరు ఒప్పుకొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్‌లో కూడా భూసేకరణ జరగాల్సి ఉన్నా అది పెద్దగా సంక్లిష్టం కాదు. ఆల్రెడీ అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన భూమి ఉంది. ఇది కాక మరికొన్ని గ్రామాల్లో భూసేకరణ జరగాల్సి ఉన్నా ఏపీ ప్రభుత్వం ఆల్రెడీ ఆ పనిలో ఉంది. రైల్వే పరంగా కృష్ణా నదిపై నిర్మించాల్సి ఉన్న కొత్త బ్రిడ్జి ఒక్కటే పెద్ద పని. ఈ ప్రాజెక్ట్ కోసం 2047 కోట్ల బడ్జెట్ కేటాయించింది రైల్వే. దీనికి 2024లోనే అప్రూవల్ వచ్చేసింది.

తెలంగాణాలోని ఖమ్మం జిల్లాకు చెందిన ఎర్రుపాలెం నుంచి ఏపీ లోని గుంటూరు జిల్లాకు చెందిన నంబూరు వరకూ అమరావతి రైల్వే లైన్ నిర్మిస్తారు. ఈ రెండు స్టేషన్‌ల మధ్య కొత్తగా 10 స్టేషన్‌లు రానుండగా వాటిలో ఏపీ రాజధాని అమరావతి ఒకటి. 2029 జనవరి నాటికి ఈ రైల్వే లైన్ పూర్తి అయ్యేలా ప్రణాళికలు జరుగుతున్నాయి. త్వరలోనే భూసేకరణ పూర్తి చేసి ఈ రైల్వే లైన్ నిర్మాణానికి శంఖు స్థాపన చెయ్యాలని రైల్వే శాఖ భావిస్తోంది.

ఆప్కోకు స్కోచ్ అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటనలో పేర్కొన్నారు. నేతన్నలకు వ్యక్తిగతంలో ఆర్థికభరోసా కలిగించేలా సంక్షేమ పథకాలు అమలుతో పాటు వారికి ఏడాది పొడవునా ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంట్లు తెలిపారు. ముఖ్యంగా చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచే లక్ష్యంతో ఆప్కోను బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఆప్కోలో డిజిటిలైజేషన్ చేపట్టామని తెలిపారు. ఫోన్ పే ద్వారా వస్త్రాలు కొనుగోలు, విధుల్లో పారదర్శకతకు ముఖాధారిత హాజరు, కొనుగోలు చేసిన వస్త్రాలకు కంప్యూటర్ బిల్లింగ్ వంటి ఎన్నో డిజిటల్ విధానాలను ప్రవేశపెట్టామని వెల్లడించారు. ఈ కామర్స్ సంస్థల ద్వారా వినియోగదారుల ఇళ్లకు నేరుగా చేనేత వస్త్రాలను ఆప్కో ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నామన్నారు. ఆప్కోలో చేపట్టిన సంస్కరణలతో అమ్మకాలు పెరిగాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆప్కో చేపట్టిన డిజిటిలైజేషన్‌కు స్కోచ్ అవార్డు లభించిందని తెలిపారు. గతేడాది రాష్ట్రంలో చేనేత, హస్త కళల ఉత్పత్తులకు ఏడు ఓడీ ఓపీ అవార్డులు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

అసెంబ్లీలో స్టాళ్లకు విశేష స్పందన

బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లకు విశేష స్పందన లభించిందని మంత్రి సవిత తెలిపారు. ఈ నెల 19వ తేదీన అసెంబ్లీ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు ఈ స్టాళ్లను ప్రారంభించారని తెలిపారు. ప్రఖ్యాతగాంచిన పొందూరు షర్ట్ లు, పంచెలు, కండువాలు, మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, ఉప్పాడ, బందరు, మానపల్లి పట్టు, సాధారణ చీరలతో పాటు రెడీమేడ్ దుస్తులను ఈ స్టాళ్లలో అమ్మకానికి పెట్టినట్లు పేర్కొన్నారు. ఆకర్షణీయమైన రంగుల్లో ఉన్న చేనేత చీరలు, షర్ట్‌లు, మోడి జాకెట్ల కొనుగోలుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి అనుచరులు, అధికారులు ఆసక్తి చూపారన్నారు. వారం రోజుల పాటు నిర్వహించిన స్టాళ్లలలో రూ. 35 లక్షలకు పైగా అమ్మకాలు జరిగాయన్నారు.

ఉత్తరాంధ్రకు మరో భారీ
ఔషధ తయారీ కంపెనీ..

(మొదటిపేజీ తరువాయి)

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో ప్రముఖ ఔషధ తయారీ సంస్థ బ్లూ జెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్ (బీజేహెచ్ఎల్) తన తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. రూ.2,300 కోట్ల భారీ పెట్టుబడితో రానున్న ఈ పరిశ్రమకు రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ రేపు (ఫిబ్రవరి 28) శంకుస్థాపన చేయనున్నారు. మహారాష్ట్ర కేంద్రంగా పనిచేస్తున్న బ్లూ జెట్ హెల్త్‌కేర్, శాస్త్ర ఆధారిత ప్రత్యేక ఔషధాలు, ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల తయారీలో జాతీయ స్థాయిలో మంచి పేరున్న సంస్థ.

ఈ సంస్థ రాంబిల్లి సెజ్‌లో ఫార్మాస్యూటికల్, ఇంటర్మీడియట్, కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం ప్రభుత్వం అనకాపల్లి జిల్లా, రాంబిల్లి మండలం, జడ్.చింతువ రెవెన్యూ పరిధిలోని సీతపాలెం వద్ద 102.48 ఎకరాల భూమిని కేటాయించింది. ఎకరాకు రూ.40 లక్షల చొప్పున భూమిని కేటాయించడంతో పాటు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అదనపు ప్రోత్సాహకాలను కూడా మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

సంస్థ మొత్తం రూ.2,300 కోట్ల పెట్టుబడిని దశల వారీగా పెట్టనుంది. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1,750 మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. 2028-29 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాలని బ్లూ జెట్ హెల్త్‌కేర్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ పెట్టుబడి రాకతో స్థానిక పారిశ్రామిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు. అంతేకాకుండా, ప్రధాన పరిశ్రమకు అనుబంధంగా అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటై పరోక్షంగా మరికొందరికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధునాతన ఫార్మాస్యూటికల్ తయారీ రంగంలో ఒక కీలక గమ్యస్థానంగా మారుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

రాజంపేట పార్లమెంటు టీడీపీ
కమిటీ ప్రమాణ స్వీకారానికి పిలుపు

- ప్రచార రథం ప్రారంభించిన
- రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్

మదనపల్లి –ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: గ్రామ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజంపేట పార్లమెంటు తెలుగుదేశం పార్టీ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు కార్యాలయం ఎదుట ఆదివారం ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. మార్చి 2న జరగనున్న పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు, కార్యదర్శులు సహా కమిటీకి చెందిన 41 మంది ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు సూచనలతో రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ ప్రచార కార్యక్రమం ప్రారంభమైందని వెల్లడించారు. గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు, నాయకులు విస్తృతంగా తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాదేళ్ల అరుణ్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సూదిళ్ల సుధాకర్, మదనపల్లి ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు నాగుర్ వలి (షో ఆఫ్ శీన), రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఎస్.ఎం. రఫీ, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేసే హక్కును కాలరాస్తున్న పోలీసులు

- ప్రజలపై పోలీసుల నిర్బంధాన్ని ప్రతిఘటిస్తాం
- సీపీఎం హెచ్చరిక

మదనపల్లి –ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకునేందుకు కలెక్టరేట్‌కు వస్తే పోలీసులు ప్రజలను నిర్బంధిస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, దీనిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు కలెక్టరేట్ వద్దకు వచ్చిన కార్మికులను పోలీసులు అడ్డుకొని ఇక్కడ ధర్నాలకు, నిరసనలకు అనుమతి లేదని, వెళ్ళిపోవాంటూ హుకుం జారీ చేయడంతో సిపిఎం తీవ్రంగా పరిగణించింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె జిల్లా కేంద్రం అయిన తరువాత పోలీసులు తీరు చాలా దారుణంగా ఉందని దుయ్యబట్టారు. భావ ప్రకటన స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. ఈ హక్కుల్ని ప్రజలు వినియోగించే విధంగా, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. మదనపల్లి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ప్రజల గొంతును నొక్కుతున్నారన్నారని దీనిని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ సమస్యల పరిష్కరించ కుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంటే, కార్మికులు, ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని నిరసనలు తెలియజేసేందుకు కలెక్టరేట్‌కు వస్తుంటే పోలీసులు అనుమతి ఇవ్వకుండా నిర్బంధాలకు గురి చేయడం, కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతుల కు గురిచేస్తూ ప్రజల గొంతును నొక్కేయడం దుర్మార్గమన్నారు. ఇటీవల జిల్లాలో డ్రగ్స్ మాఫియా రెచ్చిపోతూ, మద్యం సేవిస్తూ రోడ్లపై దారుణంగా కొట్టు కుంటున్నారన్నారు. గంజాయి అమ్మకాలు విపరీతంగా పెరిగిపోవడంతో యువత చెడువ్యసనాలకు బానిసై దారణాలకు ఒడిగడు తున్నారన్నారు. పోలీసులు వాటిపై దృష్టి సారించి, గంజాయి, మత్తు పదార్థాలు, డ్రగ్స్ అరికట్టాలని హితువు పలికారు. అంతేకాని ప్రజల గొంతునొక్కే ప్రయత్నం చేస్తే మానవ హక్కుల కమిషన్ కు వెళ్తామన్నారు. అన్ని ప్రజా సంఘాలను కూడగట్టి ప్రజలను ఐక్యం చేసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రక్షక భటులు ప్రజలకు రక్షణ కల్పించాలి కానీ అధికారులకు, నాయకులకు తొత్తులుగా వ్యవహరించకూడదని హితువు పలికారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు రామాంజులు, హరిశర్మ, లోకేష్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

- సమగ్ర శిక్షా డాక్టర్ నున్నా అనూరాధ

మదనపల్లి –ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) ప్రకారం 2026--27 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ నున్నా అనూరాధ తెలిపారు. ఉచిత ప్రవేశాలపై విస్తృత ప్రచార కార్యక్రమం లో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార బోర్డును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 12(1)(సీ) నిబంధనల మేరకు ప్రతి సంవత్సరం ప్రైవేట్ పాఠశాలల్లో కల్పించే ఉచిత ప్రవేశాలపై విస్తృత ప్రచారం నిర్వహించడం అన్ని మండల విద్యాశాఖాధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సహాయంగా జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ఏంఈఓలకు సూచించారు. అలాగే మండలంలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ల సహకారంతో అన్ని గ్రామ,వార్డు సచివాలయాల్లో కూడా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాలు సహా ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార బ్యానర్లు, కరపత్రాలు ప్రదర్శించా లన్నారు. ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్ కలిగిన అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు.

అనాథలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులు,ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన మైనార్టీలు, ఓసీ వర్గాలకు చెందిన ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలు ఈ పథకానికి అర్హులని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 10లోపు ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా గ్రామ,వార్డు సచివాలయాలు, మండల విద్యా కార్యాలయాలు లేదా మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసు కోవచ్చన్నారు. దరఖాస్తు సమయంలో విద్యార్థి జనన ధృవపత్రం, కుల ధృవపత్రం, వార్షిక ఆదాయ ధృవపత్రం జత చేయాల్సి ఉంటుందని తెలిపారు. సందేహాల నివృత్తికి 1800-4258-599 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించవచ్చని, అర్హులైన విద్యార్థులకు సీట్ల కేటా యింపు మార్చి 25న లాటరీ విధానంలో నిర్వ హిస్తామని వెల్లడించారు. సచివాలయం పరిధిలో 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలను ఎంపిక చేసుకోవాలని, ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న పాఠశాలలకు ప్రథమ ప్రాధాన్యత కల్పి స్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు కరుణాకర్, సుమతి, అసాదుల్లా,యశోద, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ "ఉద్యమి" విజయవంతం చేయాలి
- ఏపీ ఐడీసీ చైర్మన్ శ్రీ వేగుళ్ల లీలా కృష్ణ

పలమనేరు– ఆంధ్రనాడు, ఫిబ్రవరి27 : పలమనేరు నియోజకవర్గంలో "ఉద్యమి" పేరుతో జనసేన పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలని రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ (ఏపీఐడీసీ) చైర్మన్ చిత్తూరు పార్లమెంట్ సభ్యత్వ నమోదు సమన్వయకర్త శ్రీ వేగుళ్ల లీలా కృష్ణ పిలుపునిచ్చారు. పలమనేరు పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలమనేరు నియోజకవర్గ ఇన్చార్జి మరియు ఏఎంసి వైస్ చైర్మన్ పసుపులేటి దిలీప్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో, సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగుళ్ల లీలా కృష్ణ గారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, సభ్యత్వ నమోదు ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పలమనేరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో పూర్తి చేస్తామని, జనసేనాని ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పూల చైతు పాల్గొన్నారు. సీనియర్ నాయకులు జిల్లేడు అరుణ్ కుమార్ తో పాటు ఆరు మండలాల అధ్యక్షులు మోత్కూరు నాగరాజు, రంపాల శివ, ఏబీఎన్ బాబు, చందు కుమార్, దొంతల హరీష్, నాని మరియు , వీర మహిళ మురాదు, పసుపులేటి రాజేష్, జనార్ధన్, వినోద్, మాధవ్, జగదీష్, మూర్తి, రమేష్ రాజు, అనిల్, లవ్ కుమార్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'పై అవగాహన సదస్సు

పలమనేరు– ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27 : స్థానిక ఎస్.వి.సి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, అనంతపురంలోని ఎస్.కె.పి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహ కారంతో పీఎం-ఉష పథకంలో భాగంగా శుక్రవారం "ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్"పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించ బడింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశులు మాట్లాడుతూ... నేటి ఆధునిక సమాజంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సరికొత్త సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే భవిష్యత్తులో రాణించగలరని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన , పలమనేరు సి.ఐ మోహన్ రెడ్డి, చౌడేపల్లి సి.ఐ పి. సాయి ప్రసాద్ మాట్లాడుతూ...డిజిటల్ టెక్నాలజీని వాడుకునే క్రమంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం "ఎక్స్ ఎల్ఆర్" కంపెనీ ప్రతినిధులు, రిసోర్స్ పర్సన్లుగా విచ్చేసిన సుభాష్ చంద్రబోస్, కీర్తనలు ఏఐ వినియోగంపై సమగ్రంగా వివరించారు. మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్ ప్రాధాన్యత, వివిధ పరిశ్రమల్లో ఏఐ అప్లికేషన్స్, భవిష్యత్తులో ఈ రంగంలో విద్యార్థులకు లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ కె. సందీశ్వరయ్య, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ షేక్ బెన జీర్, డాక్టర్ ఇ.వాసు, ఇతర అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా అల్లు అర్జున్ ఫ్యాన్స్ సెక్రెటరీగా పూతలపట్టు గౌతమ్ నియామకం
- గౌతమ్‌కి శుభాకాంక్షలు తెలిపిన జిల్లాలో పలువురు ఫ్యాన్స్

ఐరాల– ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27 : అల్లు అర్జున్ ఫ్యాన్స్ చిత్తూరు జిల్లా సెక్రెటరీగా పూతలపట్టు గౌతం నియామకం. ఐరాల మండలం చీగరపల్లి కి చెందిన పూతలపట్టు గౌతమ్‌ని చిత్తూరు జిల్లా అల్లు అర్జున్ ఫ్యాన్స్ సెక్రెటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అల్లు అర్జున్ ఫ్యాన్స్ అధ్యక్షులు శివశంకర్. జిల్లాలో పలువురు అల్లు అర్జున్ ఫ్యాన్స్ గౌతమ్‌కి ఫోన్ ద్వారా శు భాకాంక్షలు తెలియజేశారు. గౌతమ్ మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షులు కుట్టి రాయల్, ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారని తెలిపారు. నాకు ఇచ్చినఈ పదవి ఫ్యాన్స్ అందరితో కలిసి పనిచేస్తానని తెలియజేశారు.

గణనాధుని సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27 : కానిపాక స్వామివారిని దర్శించు కున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సూరే పల్లి నంద కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి నీ దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద, వారి కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ సూపర్డెంట్ కోదండపాణి, ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, చిత్తూరు కోర్టు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గణనాధుని నిత్య అన్నదానంకి విరాళం



కాణిపాకం– ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27 : స్వామివారి నిత్య అన్నదానం కు విరాళం. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదానానికి విరాళం రూ.1,11,111లు దాత పాకాల దిషిత, మోనీష్ రెడ్డి , వారి కుటుంబ సభ్యులు, కోళ్లపల్లి, ఐరాల మండలం వాస్తవ్యులు, వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ సూపర్డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, తదితరులు ఉన్నారు.

టీటీడీకి రూ.కోటి విరాళం

తిరుమల – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27 : హైదరాబాద్‌ట చెందిన రాచమల్లు వెంకట సుజిత అనే భక్తురాలు టీటీడీ శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టుకు శుక్రవారం రూ.కోటి విరాళంగా అందించారు.ఈ మేరకు శుక్రవారం తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు.

నూతన ఆర్డీవోని కలిసిన రెవెన్యూ సిబ్బంది

రామకుప్పం– ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: కుప్పంఇంచార్జ్ ఆర్డిఓ విజయ లక్ష్మీని రామకుప్పం తాసిల్దార్ కౌలేష్ డిప్యూటీ తహశీల్దార్ బాలాజీ విఆర్వోలు మహేంద్ర రవి నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు నూతన ఆర్డీవో విజయలక్ష్మి మాట్లాడుతూ రెవిన్యూ సమస్యల పరిష్కారానికి మీ వంతు సహకారం కావాలని ప్రజలకు ఇబ్బంది లేకుండా పాలన సాగించాలని వారికి తెలియజేశారు దానికి వారు కూడా సానుకూలంగా స్పందించారు నూతన ఆర్డీవో విజయలక్ష్మి గతంలో విమానాశ్రయ భూ సేకరణలో అధికారిగా పనిచేశారు.

టిడ్కో ఇళ్ల కోసం వసూలు చేసిన నగదు వెనక్కు ఇప్పించండి

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల

తిరుపతి ప్రెస్ క్లబ్ – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: నగరంలోని పేదల నుంచి ఏపీ టిడ్కో ఇళ్ల కోసం వసూళ్ళు చేసిన నాలుగు కోట్ల రూపాయలను లబ్ధి దారులకు వెంటనే చెల్లించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జీరో అవర్‌లో అసెంబ్లీలో ఎమ్మెల్యే టిడ్కో ఇళ్ళ అంశంపై మాట్లాడారు. నగరంలోని 2,400 మంది లబ్ధిదారుల నుంచి 2018 నవంబర్, డిసెంబర్, 2019 జనవరి నెలల్లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 4 కోట్ల రూపాయలను డీడీల రూపంలో సేకరించి ఏపీ టిడ్కో ఎండీఖాతాకు జమచేయించుకుందని ఆయన తెలిపారు. లబద్ధిదారుల నుంచి నగదు జమ చేసుకున్న తరువాత టిడ్కో ఇళ్లను గత ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో లబ్ధిదారులు రెండు విధాలా నష్టపోయారని ఆయన తెలిపారు. దీంతో లబ్ధిదారులకు నాలుగు కోట్ల రూపాయలు లబ్ధిదారులకు తిరిగి చెల్లించాల్సిన పరిస్థితి



ఏర్పడిందన్నారు. కావున వెంటనే ఆ మొత్తాన్ని లబ్ధిదారులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు. మరోవైపు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరంలో ఇల్లు కావాలని సుమారు మూడు వేల మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి తిరుపతి రూరల్ మండలం కొత్తూరు గ్రామంలో 19 ఎకరాలు కేటాయించగా అందులో 5 ఎకరాలపై కోర్టు వివాదం నడుస్తున్నదని ఆయన తెలిపారు. దీంతో ప్రస్తుతం 14 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉందని మిగిలిన 11 ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ తక్షణమే కేటాయి ంచేలా ఆదేశించాలని ఆయన కోరారు. కాగా నగరంలో గతంలో దాదాపు ఇరవై ఐదు వేల మందికి పట్టాలు పంపిణీ చేయగా అందులో కేవలం పదిహేను వేల మందికే పీఎంఏవై 1.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేందని ఆయన చెప్పారు. మిగిలిన పదివేల మందికి ఇళ్ళ మంజూరు పెండింగ్ లో ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కావున పెండింగ్ లోని పదివేల ఇళ్ళను వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నూతన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం హౌసింగ్ రంగానికి 6,357 కోట్ల రూపాయలు కేటాయించడం సంతోషం అని ఆయన చెప్పారు.

జనసేన సభ్యత్వ ఉద్యమి విజయవంతం చేయాలి

- రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శ్రీనివాసులు

పీలేరు–ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: "ఉద్యమి" పేరుతో జనసేన పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మరియు ఉద్యమి కార్యక్రమ సమన్వయ కర్త కళ్యాణం శ్రీనివాసులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పీలేరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జనసేన పార్టీ పీలేరు నియోజకవర్గ ఇంచార్జ్ బెజవాడ దినేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన కార్యకర్తలు, అభిమానుల సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా జనసేన "ఉద్యమి" సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టినట్లు కార్య కర్తలకు వివరించారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఉద్యమి సభ్యత్వ ఉద్యమాన్ని ప్రారంభించి పార్టీ కార్యకర్తల కోసం తన సొంత నిధులు రెండు కోట్ల

రూపాయలు చెల్లించి పార్టీ కార్యకర్తలకు ఆదుకోవడం కోసం పెద్దపీట వేశారని పేర్కొన్నారు. ఆకస్మిక ప్రమాదాల్లో మృతి చెందిన వారికి ప్రమాద బీమా,అనారోగ్యంతో ఉన్నవారికి "ఉద్యమి" సభ్యత్వంతో ఆదుకోవడం జరుగుతుందని, సభ్యత్వం చేపట్టిన వారికి గుర్తించి గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు జనసేన పార్టీలో ఉన్నత పదవుల్లో అవకాశం కల్పించుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీలో గుర్తింపు పొందిన వారికి రాజకీయ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి వారి భవిష్యత్తుకు బాటలు వేసి నాయకులు, సాధకులుగా తీర్చిదిద్దడమే జనసేన పార్టీ లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథి అతికారి కృష్ణ, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి, పీలేరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కలప రవి, పీలేరు మండల అధ్యక్షులు మోహన్ కృష్ణ, కలికిరి మండల అధ్యక్షులు రవి, వాల్మీకిపురం మండల అధ్యక్షులు రెడ్డప్ప, పీలేరు మండల ఉపాధ్యక్షులు గురు మోహన్, మావిళ్ళ చరిత, నూర్జహాన్ వాల్మీకిపురం ఏఎంసీ డైరెక్టర్ ప్రభాకర్, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కార్మికులకు స్విమ్స్ అధికారులు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- సీఐటీయూ నేతల డిమాండ్
- స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష

తిరుపతి ప్రెస్ క్లబ్ – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: తిరుపతిలోని స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం ముందు శు క్రవారం స్విమ్స్ కార్మికులు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ దీక్షలను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి పూలమాల వేసి ప్రారంభించి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. స్విమ్స్‌లో పనిచేస్తున్న సుమారు 800 మంది కార్మికుల న్యాయమైన సమస్యలను సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంచడం సరికాదని, అధికారు లిచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.టీటీడీ ఈఓ ముద్దాడ రవిచంద్ర న్యాయం చేయాలని కోరారు. గత నాలుగు సంవత్సరాలుగా కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతూ పలుమార్లు వినతిపత్రాలు సమర్పించిన ప్పటికీ పరిష్కారం చూపలేదన్నారు. గత సంవత్సరం జూన్ నెలలో ఆందోళనలు నిర్వహించిన సందర్భంలో మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చి తొమ్మిది నెలలు పూర్తయినా అమలు చేయలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే కార్మికులు మరోమారు రిలే నిరాహార దీక్షలకు దిగాల్సి వచ్చిందన్నారు. కందారపు మురళి మాట్లాడుతూ, "కార్మికులు ఏళ్ల తరబడి అధికారులను కలిసి చర్చలు జరిపినా ఫలితం లేకపోవడం బాధాకరం. మూడు నెలల గడువు కోరిన అధికారులు తొమ్మిది నెలలు గడిచినా హామీల అమలులో ముందడుగు వేయలేదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేయడానికి కార్యాలయ ప్రాంగణంలో అవకాశం లేకుండా భారీ వాహనాలు, అంబులెన్స్‌లు, బస్సులు, కార్లు నిలిపి నిర్బంధ వాతావరణం సృష్టించడం తగదన్నారు. కష్టపడి పనిచేసే కార్మికులు కూర్చొని తమ గళం వినిపించుకునే హక్కును హరించడం అన్యాయమని తెలిపారు. యాజమాన్యం చేసిన తప్పులను సరిచేసుకుని టీటీడీ బోర్డు సమావేశంలో స్విమ్స్ కార్మికుల సమస్యలను సానుకూలంగా చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలో జి. రవి, ఎన్. వెంకటేష్, పి.వి. మునికృష్ణ, మారిముత్తు, జే. బాలకృష్ణ, పి. కోటయ్య, బి. రమేష్, రవీంద్రబాబు, ఎ. కుమార్, వి.సూరి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్. జయచంద్ర, సిఐటియు నేతలు జి. బాలసుబ్రమణ్యం, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎన్. మాధవ్, సిఐటియు నగర అధ్యక్షురాలు పి. బుజ్జి, స్విమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. వేణుగోపాల్, ఆటో యూనియన్ నగర కార్యదర్శి జి. వాసు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఈ.ఎస్. కుమార్, ఎం. నరేంద్ర, స్విమ్స్ కార్మికులు గోపి, వెంకటేష్, మునేంద్ర, రాజా, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. జూతీవం

కూరపాటి యశ్వంత్ కుమార్ వివాహ వేడుకల్లో పాల్గొన్న సోమశేఖర్ నాయుడు



ఐరాల – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: ఐరాల మండలం, కూరపాటి యశ్వంత్ కుమార్ వివాహ వేడుకల్లో పాల్గొన్న మోతుకూరి సోమశేఖర్ నాయుడు. కూరపాటి విజయ్ నాయుడు, జమున, కుమారుడు కూరపాటి యశ్వంత్ కుమార్ వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన పూతలపట్టు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సోమశేఖర్ నాయుడు. ఈ కార్యక్రమంలో భగవాన్ చౌదరి, మునేశ్వర్ రెడ్డి, అరుణ్ చంగల్రాయ్ నాయుడు గజేంద్రనాయుడు చిన్న బుజ్జి మురళి రెడ్డి సి ఆర్ మునిరత్నం గుర్రప్ప నాయుడు రాజేష్ సోము రాజశేఖర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అడవి ప్రాంతాలలో డాక్టర్ సురేష్ బాబు పర్యటన

రామకుప్పం – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: రామకుప్పం మండలం వీర్నమల అడవి ప్రాంతంలోనీ గ్రామాలను కేపిఎం హుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పర్యటించారు కుటుంబ సాధికారత సర్వే ఏ విధంగా జరుగుతున్నది దానిని పరిశీలించారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాను సారం 30 గృహాలకు ఇద్దరు గృహసారుదులు వారికి కావాల్సిన సమస్యలను నమోదు చేసుకొని ప్రభుత్వానికి తెలియజేస్తారు దాని ద్వారా వారికి కావాల్సిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను కె ఎస్ ఎస్ లో అమలు చేస్తారు పెద్ద తండాలో నెలకొన్న త్రాగునీటి సమస్యలు కూడా పరిష్కరి స్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు వెంకటరమణ మాజీ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి డైరెక్టర్ మునుస్వామి సింగిల్ విండో అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, టిడిపి ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్,టిడిపి నాయకులు కృష్ణ నాయక్ రామమూర్తి రాజా జేఈ పాండియన్ ఇంకా పలువురూ టిడిపి నాయకులు ఉన్నారు

తెప్పపై రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామివారి అభయం

తిరుమల – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27 : తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామివారు తెప్పలపై భక్తులకు అభయమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పపై స్వామివారు ఆశీనులై పుష్కరిణిలో మూడుసార్లు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పోత్సవం వేడుకగా జరిగింది. కాగా, మూడవరోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్ప స్వామి వారు తిరుచ్చిపై సర్వాలంకార భూషితుడై పురవీధుల్లో ఊరేగిన అనంతరం కోనేటిలోని తెప్పపై ఆశీనుడై మూడుసార్లు విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో (విద్యాఉఆరోగ్యం) డాక్టర్ ఏ.శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్ల మనోహర్ నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశానికి ఆహ్వానం

- పార్లమెంట్ పరిధిలోని జనశ్రేణులందరు హాజరు కావాలి : రాజా రెడ్డి

తిరుపతి ప్రెస్ క్లబ్– ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: జనసేన పార్టీ పీ.ఏ.సీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ ఆదివారం రేణిగుంట రోడ్ కేఎస్ఆర్ కళ్యాణమండపం నందు ఉదయం 9:30 గలకు తిరుపతి పార్లమెంట్ పరిధిలోని జనసేన పార్టీ నాయకులు, నియోజవర్గ ఇన్చార్జ్‌లు, పిఓసి లు, వీరమహిళలు, జనసైనికులు, క్లస్టర్ ఇంచార్జిలు, వార్డు ఇంచార్జ్ లు ముఖ్య నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తా రని శుక్రవారం తిరుపతి జనసేన పార్టీ నగర అధ్యక్షులు రాజారెడ్డి మీడియా సమావేశంలో తెలి యజేశారు. ఈ ఆత్మీయ సమావేశంలో నాదెండ్ల మనో హర్‌తో పాటు సభ్యత్వ నమోదు పార్లమెంట్ ఇంచార్జ్, తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ లు పాల్గొంటారన్నారు. ఆదివారం జరగనున్న ఈ ఆత్మీయ సమావేశ కార్యక్రమానికి తిరుపతి నియోజకవర్గ, పార్లమెంట్ నియోజకవర్గ జనశ్రేణులందరూ తప్పక పాల్గొనవలసిందిగా రాజా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో బాబ్జి, సుమన్ బాబు, దినేష్ జైన్, సుధాకర్, రాజేష్ ఆచారి, శ్రావణ్, సుజిత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇదొక సువర్ణ అవకాశం

- మార్కెట్‌కు ఆదాయంతో పాటు మంచి పేరు తెద్దాం
- ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి పనులతో పాటు వైద్య శిభిరాల నిర్వహణ
- పాలక వర్గ సమావేశంలో ఏఎంసి చైర్మన్ రాజన్న

పలమనేరు– ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో ప్రస్తుతం పని చేయడం మన అందరి అదృష్టమని ఇదొక సువర్ణ అవకాశంగా ఏఎంసీ చైర్మన్ రాజన్న పేర్కొన్నారు. ఆ మేరకు స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆశయాలు, ఆదేశాలకు అనుగుణంగా ఈ మార్కెట్ ను అన్ని విధాల అభివృద్ధి చేసి రాష్ట్రస్థాయిలో మంచి పేరును తీసుకొచ్చేందుకు అధికారులతో కలిసి పని చేద్దామని కోరారు. పట్టణ సమీపంలోని కేటల్ ఫామ్ వద్ద ఏర్పాటు కానున్న మోడల్ మార్కెట్ మన హయాంలో రావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. మార్కెట్ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని భవిష్యత్ లో ఎంతోమందికి ఉపాధిని ఇవ్వనున్న ఈ మార్కెట్ ఆదాయాన్ని పెంచే మార్గాలను చేయడంతో పాటు మంచి పేరును తీసుకొద్దామని కోరారు. అందులో భాగంగా పలమనేరు మార్కెట్ యార్డ్ ఆవరణలోని చింతపండు మండీల సమీపంలో రూ.10 లక్షల వ్యయంతో మరుగుదొడ్లు నిర్మాణం, వీ.కోట ఉప మార్కెట్ నందు రూ. 49 లక్షలతో ఏడు వాణిజ్య సముదాయ గదుల నిర్మాణానికి అంచనాలు వేసి మార్కెటింగ్ శాఖ కమిషనర్ కు పంపడం జరిగిందని వివరించారు. అదేవిధంగా త్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా పలు చోట్ల వెటర్నరీ హెల్త్ క్యాంప్స్ ను ఏర్పాటు చేయించనున్నట్లు చైర్మన్ సూచించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దిలీప్ కుమార్ తో పాటు కమిటీ సభ్యులు మరియు సెక్రటరీ సంజీవ్ కుమార్ తో పాటు సిబ్బంది ఉన్నారు.

నేడు కల్పవృక్ష వాహనంపై శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి

- శ్రీ రాజమన్నార్ అవతారంలో స్వామివారి రాజసం
- వేలాదిగా పాల్గొన్న భక్తులు

పుంగనూరు– ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: పుంగనూరులో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నాలుగో రోజు నేడు కల్పవృక్ష వాహనంపై శ్రీ రాజమన్నార్ అవతారంలో రాజసం భక్తు లకు స్వామివారు దర్శనమిచ్చారు ఈ కార్యక్రమం పుంగనూరు టిటిడి పరిధిలో నిర్వహించారు శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామివారు ఉదయం రాజమన్నార్ అలంకారంలో కల్పవృక్ష వాహనంపై పుర వీధులలో తిరుగుతూ భక్తులను కటాక్షించారు.. వాహనం ముందు మంగళ వాయిద్యాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి భజన కోలాట బృందాలు భజన, కోలాటాలు, డప్పు వాయిద్యాలు, ఆలయంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ వారి సంగీత కార్యక్రమాలు వీనుల విందుగా, శ్రావణానందకరంగా సాగుతున్నాయి.. ఉదయం మరియు సాయంత్రం ఆలయంలో విశేష హోమ కార్యక్రమాలను నిర్వహించారు పుంగనూరు పట్టణ భక్తులు అడుగడుగున స్వామి వారికి కర్పూర హారతులు సమర్పించారు. ఆలయంలో ఉదయం సాయంత్రం అన్నప్రసాద వితరణ గావిస్తున్నారు.. గోవింద నామాల పుస్తక ప్రతులను బ్రహ్మోత్సవాలు పూర్తి అయ్యేంతవరకు భక్తులకు ఉచితంగా అందజేయడం జరుగుతుంది

శుక్రవారం సాయంత్రం : హనుమంత వాహనం.

శనివారం సాయంత్రం శ్రీవారి గరుడ సేవ: బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవ రోజు 28–02–2026 శనివారం నాడు శ్రీవారి గరుడ సేవను నిర్వహిస్తున్నామని. ఇందులో భాగంగా స్వామి వారికి లక్ష్మీ కాసుల హారం స్వామివారికి శోభయాత్ర, గరుడ సేవ లో శ్రీవారికి అలంకరించే లక్ష్మీకాసుల హారాన్ని మధ్యాహ్నం మూడు గంటలకు తూర్పు మొగసాలలోని శ్రీ చాముండేశ్వరి దేవి ఆలయం నుండి శోభాయాత్ర గా ఆలయానికి తీసుకువచ్చి గరుడ సేవలో స్వామి వారికి అలంకరించడం జరిగిందని ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు

సంపాదకీయం

అమెరికాను మించి ఇజ్రాయెల్...

భారత ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం ఇజ్రాయెల్ వెళ్లారు. ఈ పర్యటన భారత్‌కు అతి కీలకమైనదిగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత్–ఇజ్రాయెల్ సంబంధాలు కేవలం ఆధునిక ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాదు.. దశాబ్దాలుగా రహస్య సహకారంతో ముడిపడి ఉన్నాయి. ఈ దౌత్య బంధం రక్షణ, సాంకేతికతల్లో కీలక పాత్ర పోషిస్తోంది. దౌత్య సంబంధాలు లేనప్పటికీ ఇజ్రాయెల్ 1971లో భారత్‌కు ఆయుధాలు, శిక్షణ అందించి అమెరికా ఒత్తిళ్లను ఎదిరించింది.

ఈ రహస్య చర్య భారత విజయానికి ముఖ్య కారణమైంది. ఇది రెండు దేశాల మధ్య విశ్వాసానికి మొదటి గుర్తింపు. ఇక 1980లో పాకిస్తాన్ అణు కార్యక్రమాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్ ధ్వంసా అధికారం సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదన భారత భద్రతా ఆందోళనలను పరిష్కరించే స్ఫూర్తిని చూపింది. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు రెండు దేశాలను వ్యూహాత్మకంగా దగ్గర చేశాయి. ఇరు దేశాల బంధాన్ని బలోపేతం చేశాయి. ఇక ఇటీవల ఆపరేషన్ సిందూర్‌కు ఇజ్రాయెల్ పూర్తి మద్దతు ఇచ్చింది. పాకిస్తాన్‌కు టర్కీ డ్రోన్లు అందించింది. వాటితో భారత్‌పై పాకిస్తాన దాడికి యత్నించింది. అదే సమయంలో ఇజ్రాయెల్ భారత్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ అందించింది. దీంతో భారత సైన్య పాకిస్తాన్ డ్రోన్లను సమర్థవంతంగా తిప్పికొట్టింది. నెతన్యాహు గతంలో ఐక్యరాజ్య సమితిలో వాషింగ్టన్ కంటే ఢిల్లీనే ఎక్కువగా నమ్ముతామని చెప్పారు. రక్షణ, వ్యవసాయం, అఐ రంగాల్లో సహకారం ఇప్పుడు అభివృద్ధి చెందుతోంది.ఈ చరిత్రాత్మక సంఘటనలు రెండు దేశాల సంబంధాన్ని విశ్వాసంతో బలపరుస్తున్నాయి. భవిష్యత్తులో సైబర్ భద్రత, డ్రోన్ సాంకేతికతల్లో మరిన్ని భాగస్వామ్యాలు ఆశిస్తున్నాయి. ఇది భారత్ మధ్యప్రాచ్య వ్యూహంలో కీలకమవుతుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించి కలిశారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక ఎయిర్‌పోర్టులో నెతన్యాహు భార్య కాషాయ రంగు దుస్తులు ధరించి వచ్చింది. ఇలాంటి నేపథ్యంలో మోదీ పర్యటనపై ఒకవైపు సానుకూల విశ్లేషణలు వస్తుండగా కొందరు ఈ పర్యటనతో భారత్‌కన్నా ఎక్కువగా నెతన్యాహుకే లబ్ధి కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు. మోదీ పర్యటన వెనుక రాజకీయ లక్ష్యాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.గతంలో భారత్ ? ఇజ్రాయెల్ మధ్య సంత్సంబంధాలు ఉండేవి కావు. పాలస్తీనాపై వ్యతిరేకత కారణంగా భారత్ ఇజ్రాయెల్‌ను దూరంగా ఉంచింది. అయితే పీవీ నర్సింహారావు పాలనలో దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. బీజేపీ, సంఘ్ పరివార్ మొదటి నుంచి ఇజ్రాయెల్ అనుకూలంగా ఉనానయి. ఇజ్రాయెల్ ముస్లిం దేశాలకు వ్యతిరేకంగా యుద్ధాలు చేస్తుంది. అందుకే బీజేపీ, సంఘ్ ఇష్టపడతాయి.మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ, సాంకేతికతల్లో భారత్?ఇజ్రాయెల్ బంధం బలపడింది. తాజా పర్యటనలో ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో ప్రసంగం చారిత్రకం. అయితే, విపక్షం ప్రభుత్వ వ్యతిరేకతతో బహిష్కరణ ప్రకటించింది.నెతన్యాహు బలహీన స్థితిలో ఉన్నారు. ఎన్నికలు జరిగితే ఓటమి అవకాశం ఎక్కువ. అవినీతి ఆరోపణలు, జుడీషియల్ సంస్కరణలపై ప్రతిపక్షుల వ్యతిరేకత, హమాస్ దాడి ముందు పదవి కోల్పోయే పరిస్థితి. ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు వ్యతిరేకులు, సౌత్ ఆఫ్రికా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి అరెస్ట్ వారెంట్ కోరిందినెతన్యాహు మోదీ ఆహ్వానంతో తన ఇమేజ్‌ను మెరుగుపరచుకోవాలని భావించారు. భారత్ ప్రధాని సందర్శన ఆయనకు దేశీయ, అంతర్జాతీయ గౌరవాన్ని పెంచుతుంది. ఈ ప్రాంతంలో చర్చలు ? శాంతియుత పరిష్కారాలకు భారతదేశం నిరంతర మద్దతు తెలుపుతుందని, ఉద్రిక్తతలను తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రధాన మంత్రి మోదీ వెల్లడించారు. శాంతికి మార్గంగా గాజా శాంతి ప్రణాళికను ఆయన ప్రత్యేకంగా స్వాగతించారు. స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తిగా మద్దతు ఇస్తుందని, మానవాళి ఎప్పుడూ సంఘర్షణ బాధితురాలిగా మారకూడదని పేర్కొన్నారు. ఉమ్మడి మీడియా సమావేశంలో, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రధాన మంత్రి మోదీ పర్యటనను అద్భుతమైనదిగా, అసాధారణంగా అభివర్ణించారు. తక్కువ వ్యవధి ఉన్నప్పటికీ, ఇది చాలా హృదయాన్ని కదిలించేదన్నారు.అంతకుముందు రోజు పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం భావోద్వేగ ప్రభావాన్ని ఆయన ప్రశంసించారు. అది ఇజ్రాయెల్‌లోని ప్రతి ఒక్కరి కళ్ళలో కన్నీళ్లు తెప్పించలేదని అన్నారు.

కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, నెతన్యాహు ఇజ్రాయెల్ భారతదేశం అచంచలమైన స్నేహానికి ఎంతో రుణపడి ఉందని అన్నారు. రెండు దేశాల మధ్య వ్యక్తిగత సంబంధాలను ప్రతిబింబిస్తూ, వారి వివాహానికి ముందు టెల్ అవీవ్‌లోని ఒక భారతీయ రెస్టారెంట్‌లో తన భార్య సారాతో అద్భుతమైన భోజనాన్ని ఆస్వాదించడం గురించి వ్యక్తిగత కథను పంచుకున్నారు. రెండు దేశాల మధ్య ప్రతిభావంతులు, ఆలోచనలు, భావాలు సమావేశమయ్యే అవకా శాలను ఇజ్రాయెల్ నాయకుడు నెతన్యాహు ప్రస్తావించారు. ఈ సంబంధం కొన సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశంలో త్వరలో ప్రభుత్వానికి మధ్య ప్రభుత్వానికి సమావేశం నిర్వహించే ప్రణాళికలను ఆయన ప్రకటించారు. మరిన్ని చర్చలకు ప్రముఖ మంత్రులను ఆహ్వానించే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.అయితే, ఇరాన్‌పై అమెరికా దాడి సందర్భంలో ఇజ్రాయెల్ మద్దతు, గల్ఫ్ దేశాల ఒత్తిళ్లు భారత్‌ను కష్ట పరిస్థితిలో ఉంచవచ్చు.మోదీ పర్యటన భారత్ మధ్యప్రాచ్య వ్యూహాన్ని ప్రభావితం చేస్తుంది. ఇరాన్ వ్యతిరేక చర్యలకు మద్దతుగా కనిపించడం దీర్ఘకాలంలో దక్షిణ ఆసియా సంబంధాలను దెబ్బతీస్తుంది. రెండు దేశాల సహకారం లాభదాయకమైనా, భౌగోళిక రాజకీయాలు జాగ్రత్తలు పాటించాలి.

ఆశక్తిగా మారుతున్న చెన్నై రాజకీయాలు

చెన్నై – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళనాడు రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది.. మొన్నటి వరకు అక్కడ ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నది డీఎంకే, అన్నాడీఎంకే రెండు కూటములు మాత్రమే.. తాజాగా ఈ ఎన్నికల్లో నటుడు విజయ్ స్థాపించిన టివికే కూడా బరిలో ఉంది. ఇవి చాలదు అన్నట్లు ఇప్పుడు కొత్త పార్టీతో జయలలిత నెచ్చెలి శశికళ కూడా వస్తున్నారు. అంటే ఈ సారి తమిళనాడు ఎన్నికల పోరులో చతుర్ముఖ పోరు తప్పేలా లేదన్న టాక్ వినిపిస్తోంది. అయితే ఉన్నట్టుండి చిన్నమ్మ రాజకీయ పార్టీ ఏర్పాటు ఎవరి కోసం..? అదే ఇపుడు ఆ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత ఉన్నప్పుడు అన్ని తానే నడిపిన నాయకురాలు శశికళ అన్నది అందరికీ తెలిసిన విషయం. జయలలిత మరణం తర్వాత అక్రమాస్తుల కేసులో జైలుకెళ్లి విడుదలైన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటున్న శశికళ ఇప్పుడు సొంతంగా రాజకీయ పార్టీ ప్రకటన చేశారు. ఇప్పటికే శశికళ మేనల్లుడు టీటీవీ దినకరన్ ఆధ్వర్యంలో ఓ పార్టీ ఉంది. మళ్లీ ఇప్పుడు శశికళ మరో పార్టీ పెట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అన్నదే ఇప్పుడు తమిళనాడులో చర్చనీయాంశంగా మారగా ఎందుకు అన్నది కూడా అందరికీ తెలిసిన విషయమే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తమిళనాడులో గతంలో రెండు కూటముల్లో ఉన్న పార్టీలు ఇప్పుడు అదే చోట లేదు. ఏ పార్టీ ఎప్పుడు ఏ కూటమిలో ఉంటుందో చెప్పలేని పరిస్థితి.. ఒకప్పుడు డీఎంకే తో ఉన్న పార్టీలు అన్నా డీఎంకే తో కలిస్తే తాజాగా అటు నుంచి ఇటు..ఇటు నుంచి అటు మారాయి.. ఇక అన్నా డీఎంకే లో చక్రం తిప్పిన నేతలు మాజీ ముఖ్యమంత్రి సైతం డీఎంకే గెలుపు కోరుతుండడం మరింత ఆసక్తిని రేపుతున్నాయి.ఆసక్తికరమైన రాజకీయాలకు కేరాఫ్ గా నిలిచే తమిళనాడులో ఇపుడు చిత్ర విచిత్రాలు జరుగుతున్నాయి.. తాజా పరిణామాలు అక్కడి రాజకీయాల్లో సంచలనంగా మారాయి. మొదటి నుంచీ డీఎంకే , అన్నాడీఎంకే అంటే ఉప్పు.. నిప్పు.. రెండు పార్టీల నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అయితే తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కీలక నేతల ఆలోచనా తీరులో మార్పు వస్తోంది. జయలలిత ఉన్నపుడు అన్నీ తానై నడిపిన శశికళకు కూడా ఇప్పుడు డీఎంకే గెలుపే



లక్ష్యంగా పావులు కదుపుతున్నట్లు తాజా పరిణామాలు చెబుతున్నాయి.ఒకప్పుడు డీఎంకేతో సుదీర్ఘ కాలం కలిసి నడిచిన పీఎంకే పార్టీ ఇప్పుడు అన్నాడీఎంకే బీజేపీ కూటమితో జతకట్టింది. పీఎంకే అంటే తమిళనాడులో బలమైన వన్నియర్ సామాజికవర్గ ఓటు బ్యాంకు కలిగిన పార్టీ.. ఇక నటుడు దివంగత విజయ్ కాంత్ కు చెందిన డీఎండీకే పార్టీ డీఎంకే తో చేతులు కలిపింది. గతంలో 2011 ఎన్నికల్లో జయలలితతో కలిసి పోటీ చేసి విజయం సాధించి అధికారం దక్కించుకున్న చరిత్ర విజయ్ కాంత్ పార్టీకి ఉంది. అలాంటిది ఇపుడు అనూహ్యంగా డీఎంకేతో జత కట్టింది డీఎండీకే. పీఎంకే, డీఎండీకే అటు ఇటు మారాయి.ఇక కీలకమైన మరో రెండు పరిణామాలు కూడా ఉన్నాయి.. అందులో ఒకటి మాజీ సీఎం జయలలిత నమ్మిన బంటు ఓ పన్నీర్ సెల్వం డీఎంకే కు మద్దతుగా నిలవడం. సీఎం స్టాలిన్‌తో మాజీ సీఎం ఓపీఎస్ భేటీ అయిన స్టాలిన్‌కు మద్దతు తెలిపారు. డీఎంకే ఐదేళ్ల పాలనను పొగిడిన ఓపీఎస్.. వచ్చే ఎన్నికల్లో డీఎంకే మళ్లీ గెలుస్తుందని జోస్యం చెప్పారు. డీఎంకే పాలనపై ప్రజల్లో నమ్మకం ఉందని ఓపీఎస్ అన్నారు. తమిళనాడులో గంటగంటకు మారుతున్న రాజకీయ పరిణామాలతో ఎవరు ఎప్పుడు ఎవరితో కలుస్తారో గ్యారెంటీ లేని పరిస్థితి నెలకొంటోంది.కాగా అన్నాడీఎంకే టార్గెట్ గా పలు రాజకీయ పార్టీలు రాజకీయ చదరంగంలో పావులు కదుపుతున్నాయి. ఒకప్పుడు తాను సారథ్యం ఆశించిన అన్నాడీఎంకే టార్గెట్ గా పార్టీ పెట్టేందుకు శశికళ ఏర్పాట్లు చేయడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అన్నాడీఎంకే పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకులో ప్రధానంగా దేవర్ సామాజిక వర్గం ఉంది. ఈ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత మాజీమంత్రి సెంగోట్టియన్ ఆ పార్టీని వీడి విజయ్ స్థాపించిన టీవీకే పార్టీలో చేరారు. ఇదే సామాజిక వర్గానికి చెందిన మాజీ సీఎం పన్నీర్ సెల్వం డీఎంకే కు మద్దతుగా నిలుస్తున్నారు. మరో వైపు అదే సమాజిక వర్గానికి చెందిన శశికళ కూడా కొత్తగా పార్టీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇవన్నీ అన్నాడీఎంకే ఓటు బ్యాంకు కు గండి కొట్టే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అన్నాడీఎంకేను మ్యాగ్జిమ్ డ్యామేజ్ చేసి విజయ్ పార్టీకి సహకరించడమే శశికళ ఎత్తుగడ అన్న ప్రచారం కూడా జరుగుతోంది.జయలలిత జయంతి సభలో శశికళ పార్టీ ప్రకటన చేశారు. తమ పార్టీ జెండా అజెండా ఏంటన్నది వివరించారు.. పార్టీ పేరు మాత్రం త్వరలోనే ప్రకటిస్తానని చెప్పారు.. మొత్తానికి ఎన్నికల తేదీని ఈసీ ప్రకటించకముందే తమిళ రాజకీయాలు రంజుగా మారుతున్నాయి

రాజీనామానే బ్రహ్మాస్త్రం

అమరావతి – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలా మంది ఎమ్మెల్సీలు గుడ్ బై చెప్పారు. పార్టీకి రాజీనామా చేయడంతో పాటు పదవులను వదులుకునేందుకు సిద్ధపడ్డారు. కానీ వారి రాజీనామాలు ఆమోదానికి నోచుకోలేదు. దీంతో వారు న్యాయ పోరాటం చేయడం ప్రారంభించారు. దీంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి మండలి చైర్మన్ కు ఏర్పడింది. అందుకే రాజీనామా చేసిన వారిని పిలిపించి వివరణ తీసుకుంటున్నారు మండలి చైర్మన్ మోసేన్ రాజు. నిన్ననే చైర్మన్ ను కలిసి వివరణ ఇచ్చారు జయ మంగళం వెంకటరమణ. ఈరోజు మిగతా ఎమ్మెల్సీలు సైతం చైర్మన్ ను కలిసి తమ వివరణ ఇచ్చారు. తప్పకుండా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం మండలి చైర్మన్ కు ఏర్పడింది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. ఓ నలుగురు రాజ్యసభ సభ్యులతో పాటు ఏడుగురు వరకు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యుల రాజీనామాకు ఆమోదం లభించడం.. వారి స్థానంలో కొత్త వారి ఎన్నిక కూడా పూర్తయింది. కానీ ఎమ్మెల్సీల విషయంలో మాత్రం రాజీనామాలు ఆమోదానికి నోచుకోలేదు. ఎందుకంటే శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉంది. ఈ ఐదుగురి రాజీనామాను ఆమోదిస్తే ఈ పదవులన్నీ కూటమి ఖాతాలో చేరుతాయి. మండలిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ బలం కూడా

పడిపోతుంది. దాదాపు ఏడాదిన్నరకు పైగా తొక్కి పెట్టారు రాజీనామాలను మండల చైర్మన్. కానీ ఇప్పుడు కోర్టు ఆదేశాలతో వారి వివరణ తీసుకుని ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి మండలి చైర్మన్ ది.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 30 మంది వరకు ఎమ్మెల్సీల బలం ఉంది. కూటమికి శాసన మండలిలో పదిమంది మాత్రమే సభ్యులు ఉన్నారు. ఈ ఆరుగురు రాజీనామాను ఆమోదిస్తే కూటమి ఖాతాల్లో చేరనున్నాయి. 20 పైగా బలం పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ రాజీనామాలు ఆమోదించిన మరుక్షణం మరికొంతమంది వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీతో పాటు పదవులకు రాజీనామా చేసే ఛాన్స్ ఉంది. ఇప్పటివరకు అనర్హత వేటు పడుతుందన్న భయంతోనే ఎక్కువమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వచ్చారు. అయితే ఆ ఆరుగురు రాజీనామాల విషయంలో ఆమోదం లభించిన మరుక్షణం.. చాలామంది వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీకి గుడ్ బై చెప్పే ఆలోచనతో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. 2028 వరకు మోసేన్ రాజు పదవీకాలం ఉంది. అందుకే వీలైనంత త్వరగా శాసనమండలిని హస్తగతం చేసుకోవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. కూటమి చైర్మన్ వారి రాజీనామాలను ఆమోదించిన మరుక్షణం.. మరి కొంతమంది ఎమ్మెల్సీలు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

వేగం పెంచుతున్న అధికార పార్టీ

హైదరాబాద్ – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27

తెలంగాణలో త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాలనలో వేగం పెంచింది. గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించడమే లక్ష్యంగా అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ నలుగురు కీలక మంత్రులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తం కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. రాబోయే ఎన్నికల నాటికి ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకు ఈ సబ్ కమిటీ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయనుంది. గ్రామీణ మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ఈ ప్లాన్ ప్రధానంగా దృష్టి సారించనుంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ ప్రణాళికను క్షేత్రస్థాయిలో అమలు చేసేలా

ప్రభుత్వం యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ వ్యూహం ప్రకారం.. రాబోయే మూడు నెలల పాటు మంత్రులు, ఉన్నతాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలోనే పర్యటించనున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు, కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతి పదికన పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరువ చేయడం ద్వారా రాజ కీయంగా లబ్ధి పొందాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనుల సందడి నెలకొనేలా చూడాలని సబ్ కమిటీ నిర్ణయించింది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, వంద రోజుల లోపు స్పష్టమైన మార్పు చూపడం ద్వారా ఎన్నికల బరిలోకి దిగాలని ప్రభుత్వం యోచిస్తోంది. అధికారులకు సైతం స్పష్టమైన గడువులను నిర్దేశించి, పనుల్లో జాప్యం లేకుండా పర్యవేక్షించే బాధ్యతను ఈ నలుగురు మంత్రుల కమిటీకి అప్పగించారు.

ప్రకృతి కాపాడటంలో విద్యార్థుల పాత్ర కీలకం....

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం–ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: ప్రకృతి కాపాడటంలో విద్యార్థుల పాత్ర కీలకమని కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్త పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గృహాలు, వ్యాపార సంస్థలు మరియు పరిశ్రమల నుంచి వెలువడుతున్న చెత్తను మూడు ప్రధాన రకాలుగా వర్గీకరించి వాటి నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తడి చెత్త (వెట్ వేస్ట్) – వంటింటి మిగులు పదార్థాలు, కూరగాయలు, పండ్ల తొక్కలు వంటి అవశేషాలు. పొడి చెత్త (డ్రై వేస్ట్) – ప్లాస్టిక్, కాగితం, లోహం, గాజు వంటి పునర్వినియోగపరచదగిన పదార్థాలు. హానికర చెత్త (హాజర్డస్ వేస్ట్) – బ్యాటరీలు, రసాయనాలు, ఔషధ అవశేషాలు వంటి ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు. ప్రతి ఇంటి వద్దే చెత్తను వేరు చేయడం తప్పనిసరి అని విద్యార్థులకు తెలియపరిచారు. చెత్త వేరు చేయని పక్షంలో జరిమానాలు విధించనున్నామని హెచ్చరించారు. అలాగే తడి చెత్తను కంపోస్టింగ్ కేంద్రాలకు తరలించి ఎరువుగా తయారు చేయడం, పొడి చెత్తను రీసైక్లింగ్ యూనిట్లకు పంపించడం జరుగుతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో పౌరుల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని కమిషనర్ పేర్కొన్నారు. కుక్క మునిసిపాలిటీని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్వి గ్రూప్స్ అధినేత బి.ఎం దయానిధి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోము వీర్రాజుకి వైసీపీ వారు క్షమాపణలు చెప్పాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు

రామకుప్పం –ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: మంగళగిరి జనసేన కేంద్రకార్యాలయం పై దాడి చేసి కార్లు ధ్వంసం చేయడం చాలా దారుణం అని చిత్తూరు జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీశ్వర్ నాయుడు ప్రధాన కార్యదర్శి అట్లూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో ఖండించారు అరాచక శక్తుల పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు అదేవిధంగా శాసనమండలిలో బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షులు శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు పైవైసీపీ వారు దాడి చేసేందుకు ప్రయత్నించడం ప్రజా స్వామానికి చాలా అవమానకరమన్నారు సోము వీర్రాజు పై దాడికి ప్రయత్ని ంచేవారు వారికి ప్రజాస్వామ్యంపై మర్యాద ఇచ్చేవారైతే బె షరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

హైవేపై కాలి బూడిదైన ఎలక్ట్రిక్ కారు!

గంగవరం– ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: తిరుపతి – బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేపై శు క్రవారం వేకువజామున పెను ప్రమాదం తప్పింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి, చూస్తుండగానే కారు పూర్తిగా కాలి బూడిదైంది. గంగవరం మండలం, కేటిల్ ఫార్మ్ సమీపంలోని గోశాల వద్ద బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సురేంద్ర తిరుపతి నుంచి బెంగళూరుకు వెళు ్తండగా కారులో ఒక్కసారిగా పొగలు రావడం గమనించిన సురేంద్ర, వెంటనే అప్రమత్తమై కారును నిలిపివేసి కుటుంబంతో సహా కిందకు దిగారు. వారు దిగిన కొద్ది సేపటికే మంటలు తీవ్రరూపం దాల్చి కారును పూర్తిగా దహించివేశాయి. అప్రమత్తతతో వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పి, అందరూ సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బ్యాటరీలో తలెత్తిన సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని అను మానిస్తున్నారు.

ఔషధ రంగానికి ఏ ఐ టెక్నాలజీ జోడిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చు

రామచంద్రాపురం– ఆంధ్ర నాడు,ఫిబ్రవరి 27 : ఔషధ రంగానికి ఏఐ టెక్నాలజీ జోడిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చునని సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసి ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు అన్నారు. స్థానిక వెంకట్రామాపురంలో ఉన్న సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నందు ఫార్మసిస్టుల 2026 ఫార్మా వార్షికోత్సవం నిర్వహించారు. ఈ వార్షికోత్సవాన్ని టెక్నో,సాంస్కృతిక, క్రీడ విభాగాలుగా నిర్వహిం చడమైనది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు ఎంతో ఒత్తిడితో ఉండిన వార్షికోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడం అభినంద నీయమన్నారు.ఫార్మసీ రంగానికి ఏ ఐ టెక్నాలజీని ఏ విధంగా అనుసంధానం చేయాలనే విషయం పైన పలు కళాశాలల ఫార్మసీ నిపుణులు వివరించారు.ఈ వార్షికోత్సవంలో పాల్గొన్న వివిధ ఫార్మసీ కళాశాలలకు చెందిన విద్యార్థులకు వాలీబాల్, బాల్ బ్యాట్మెంటన్, కబడ్డీ,చెస్ వంటి క్రీడలలో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. సంగీత నృత్య నాటక పోటీలు ఏర్పాటు చేసి న్యాయ నిర్ణేతల ద్వారా ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేశారు.సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసి యాజమాన్యం వార్షికోత్సవ పోటీలలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పలుక ఫార్మసీ కళాశాలల నిపుణులు,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండలో వైభవంగా విగ్రహాల ప్రతిష్ట

తంబళ్లపల్లి–ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27:తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండలో నూతనంగా పునఃనిర్మించిన ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.శుక్రవారం ఈఓ మునిరాజ ఆధ్వర్యంలో మల్లయ్యకొండ కింద మద్దా భక్తుని భావి వద్ద నిర్మించిన వినాయక ఆలయంలో వినాయకుడిని, ఆంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయుడిని, కొండ మధ్యలో నిర్మించిన ఏనుగు మల్లమ్మ ఆలయంలో ఏనుగు మల్లమ్మ అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట చేశారు.తెల్లవారుజామునుంచి వేద పండితులు వేద మంత్రోచ్చారణలతో గణపతి హోమం,ఇతర హోమాలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతరం మూడు ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారాకనాథ రెడ్డి సతీమణి కవితమ్మ, మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి పద్మావతమ్మ దంపతులు, టీడీపీ నేతలు సిద్ధారెడ్డి,బోయపల్లె శివ, బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ శంకర్ రెడ్డి, మగ్గాలు లక్ష్మయ్య,జనసేన నాయకులు ఎద్దుల నరసింహులు,మల్లికార్జున స్వామి అన్నదాన ట్రస్ట్ సభ్యులు, ఆలయ సిబ్బంది కొండ కిట్ట, ఈశ్వర, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కార్వేటినగరం – ఆంధ్రనాడు,ఫిబ్రవరి 27 :కార్వేటి నగరం టౌన్ లోనీ హిందూ ముస్లిం కల్యాణ మండపంలో జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నై డాక్టర్ అగర్వాల్ కంటి హాస్పిటల్ వైద్యులతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం లో 205 మంది ప్రజలు విచ్చేసారు. వారిలో 67 మంది కి కాట్రాక్ట్ ఉన్నట్టు గుర్తించారు,138 మందికి కంటి చూపు మందగించాడాన్ని గుర్తించి వారికి డ్రాప్స్, కంటి అద్దాలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జై భీమ్ ఫౌండేషన్ ఫౌండర్ స్టేట్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పరంధామన్, సెక్రటరీ నరేష్ లీగల్ అడ్వైసం, గుఱ్ఱప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కేవీబీపురం–ఆంధ్రనాడు,ఫిబ్రవరి 27: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్(ఆదర్శ పాఠశాల)లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026–27విద్యా సంవత్సరంలో ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో విద్యార్థులు చేరుట కొరకు www.cse.ap.gov. in/apms. ap.gov. in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో మార్చి 31 వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఓసి,బిసి విద్యార్థులు 200 రూ, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు125రూ పరీక్ష రుసుము చెల్లించాలని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పన్నులు చెల్లించి -పంచాయతీ అభివృద్ధికి సహకారం అందించండి

చంద్రగిరి –ఆంధ్ర నాడు,ఫిబ్రవరి 27 : చంద్రగిరి పట్టణంలోని దుకాణదారులు, నివాసస్తులు పంచాయితీకి చెల్లించాల్సిన పన్నులను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకారం అందించాలని ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. చంద్రగిరి పట్టణంలో ఉన్న దుకాణా దారులు లైసెన్సు రెన్యువల్ కు ఫిబ్రవరి 28 ఆఖరి తేదీ అని గుర్తించుకుని ఫీజు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలన్నారు.అదేవిధంగా నివా సస్తులు మార్చి 5వ తేదీ లోపుగా ఇంటి పన్నులు చెల్లించాలని తెలియజేశారు.గడువు లోపల ఫీజులు పన్నులు చెల్లించకపోతే జరిమానా కట్టాల్సి ఉంటుందని వివరించారు. ఈ విషయం పైన ప్రజలు తగిన విధంగా అప్రమత్తంతో ఆలోచించాలన్నారు.

పంచాయతీ కార్యదర్శి మండల ప్రెసిడెంట్‌గా రమేష్

కార్వేటినగరం – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: కార్వేటి నగరం మండలం పంచాయతీ కార్యదర్శుల సమావేశాన్ని మండల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి మండల ప్రెసిడెంట్‌గా రమేష్ , ఉపాధ్యక్షులు గోపి, ప్రధాన కార్యదర్శి హరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. కోశాధికారిగా ధరణి సంయుక్త కార్యదర్శి సాయి భవాని, మిగిలిన పంచాయతి కార్యదర్శులు సభ్యులుగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

పేద విద్యార్థులకు నాంది ఫౌండేషన్ చేయూత

చంద్రగిరి – ఆంధ్రనాడు,ఫిబ్రవరి 27 : ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న పేద విద్యార్థులకు నాంది ఫౌండేషన్ సంస్థ ఐతేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 2003 వ సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులతో కలిసి చేయూతను అందించారు. చంద్రగిరి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివే విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే ప్యాడ్లు, పెన్సిల్లు, పెన్నులు,స్కేలు,ఎరైజర్ వంటి సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాంది ఫౌండేషన్ వ్యవస్థాపకులు పసల ప్రసాద్ మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు చేసే సహాయం ఎప్పటికీ వృధాగా పోదన్నారు దాతలు అందించే సహకారంతో విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆశిస్తు న్నామన్నారు.ఈ కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్, శ్రీ శక్తి మిషన్ డిస్టిక్ కోఆర్డినేటర్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్–కృష్ణ మంజూరి ,సైకో సోషల్ కౌన్సిలర్,డి జాహ్నవి మండలంలోని ప్రధానోపాధ్యాయులు జయరాం నాయుడు, మదనమోహన్,కేశవయ్య, హైమావతి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం

పెద్దపంజాణి– ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27 : మండలంలోని రాజుపల్లె పంచాయతీ కమ్మినాయనపల్లిలో శుక్రవారం శ్రీ గంగాధరేశ్వర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మూల మంత్ర హోమం, మహా పూర్ణాహుతి, దీపారాధన కార్యక్రమాలతో పాటు మహా కుంభాభిషేకం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా జనసేన పార్టీ
కార్యాలయం ప్రారంభోత్సవం
-ముమ్మరంగా జనసేన క్రియా శీలక సభ్యత్వాలు నమోదు
-సభ్యత్వాల నమోదులో తంబళ్లపల్లిని రాష్ట్రంలో అగ్రగామిగా నిలుపుతాం
-జనసేన నియోజకవర్గ నేత సద్దికూటి హరినాథ్

తంబళ్లపల్లి–ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం జనసేన పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించనన్నట్టు జనసేన నియోజకవర్గ నాయకులు సద్దికూటి హరినాథ్ తెలిపారు. రెండు రోజులుగా జనసైనికులతో కలసి తంబళ్లపల్లె నియోజకవర్గంలో ముమ్మరంగా పర్యటిస్తూ నాయకులు, కార్యకర్తలను కలసి పరామర్శిస్తూ వారి యోగ క్షేమాలు, సమస్యలు తెలుసుకుంటూ అండగా ఉంటానని భరోసా ఇస్తున్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరుతున్నారు. జనసేన అదిష్టానం, డిప్యూటీ సీఎం పిలుపు మేరకు తంబళ్లపల్లె మండలంలో జనసేన క్రియా శీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడుతున్నారు. రికార్డు స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేసి తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు కానుకగా ఇస్తామన్నారు.

వన్యకుల సంఘం సమావేశం

రేణిగుంట –ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27 : రేణిగుంట గంగమ్మ గుడి ఆవరణంలో శుక్రవారం వన్యకుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.మార్చి 8న తిరుపతిలో నిర్వహించే వన్నెకుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనివన్నె కులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్స్ తేజోవతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తిరుపతిలో జరిగే సభకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తేజవతి మాట్లాడుతూ వన్నెకుల, అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వన్నె రెడ్డి, వన్నె కాపు, పల్లి రెడ్డి, పల్లి కాపు, పల్లి, నాయకర్, గౌండర్, పడయాచి అన్ని ఉపకులాలను ఒకే తాటిపైకి తీసుకువచ్చే ఉద్దేశంతో ఈ నెల మార్చి 8 తిరుపతి సమీపంలోని తనపల్లి క్రాస్ వద్ద ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని ఏర్పాటు చేసామన్నారు.ఈ సమ్మేళనం యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఐక్యత అన్నారు. మారుతున్న కాలంతో పాటు వన్నెకుల క్షత్రియులు కూడా అభివృద్ధి పథంలో నడవాలంటే మనమందరం కలిసికట్టుగా ఉండటం చాలా అవసరమన్నారు.ఈ సమ్మేళనం స్పష్టమైన ఆశయాలు ఉన్నాయని చదువుకోవాలనుకునే పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం, గృహనిర్మాణంతో పాటు వ్యాపారాలకు ఆర్థిక సహాయం అందించే దిశగా అడుగులు వేస్తున్నామనీ యువతకు స్వయం ఉపాధి కల్పించేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారెడ్డి, బాలసుబ్రమణ్యం అయ్యంగారు, పుష్ప నాథన్ మునిరత్నం రెడ్డి, భాస్కర్ రెడ్డి , ఢిల్లీరెడ్డి, వి ఆర్ రావణన్, రామయ్య, సోలా మల్లికార్జున్ రెడ్డి, ఎం జి. రాజేష్ రెడ్డి, సదాశివరెడ్డి, కృష్ణారెడ్డి, దినేష్, పవన్, సదాశివ, పద్మనాభరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాల నమోదులో తంబళ్లపల్లిని అగ్రగామిగా నిలుపుతాం
-రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసులును కలసిన తంబళ్లపల్లె జనసైనికులు
-దుస్సాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానం

తంబళ్లపల్లి–ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: జనసేన 'ఉద్యమి'సభ్యత్వాల నమోదులో తంబళ్లపల్లె మండలాన్ని రాష్ట్రంలోనే అగ్ర స్థానంలో నిలుపుతామని జనసేన యువ నాయకులు సిద్దమల్రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ములకలచెరువులో పర్యటించిన రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్,ఉద్యమి కార్యక్రమ సమన్వయ కర్త కళ్యాణం శ్రీనివాసులు,రాజంపేట పార్లమెంటు సమన్వయ కర్త అతికారి కృష్ణను తంబళ్లపల్లి జనసైనికులు మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన ఇంచార్జ్ సాయినాథ్ తో కలసి తంబళ్లపల్లి మండలంలో ప్రస్తుత రాజకీయ స్థితి, చేపట్టవలసిన అభివృద్ధి పనులు, నాయకులు, కార్యకర్తల సమస్యలను వారికి వివరించారు. అనంతరం యువ నాయకులు సిద్దమల్ రెడ్డి ఆధ్వర్యంలో జనసైనికులు తంబళ్లపల్లి జనసేన ఇంచార్జ్ పోతుల సాయినాథ్‌ను పాల్గొన్నారు.

విద్యార్థుల అవగాహన సదస్సులో అగ్నిమాపక స్టేషన్ అధికారి రాజయ్య

సత్యవేడు – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27: సాంకేతిక లోపాలు, నిర్లక్ష్యం వల్లే అధికంగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని సత్యవేడు అగ్నిమాపక స్టేషన్ ప్రధాన అధికారి రాజయ్య చెప్పారు. శుక్రవారం శ్రీ సి.దాస్ డిగ్రీ కళాశాలలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సుతో పాటు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాద స్టేషనరీ రాజయ్య మాట్లాడుతూ ముఖ్యంగా షార్ట్ సర్క్యూట్లు, నిప్పుతో పడేసిన సిగరెట్లు, గ్యాస్ లీకేజీలు వంటివి అగ్ని ప్రమాదాలు సంభవించడానికి కారణమన్నారు. అగ్ని ప్రమాదాలను దీటుగా ఎదుర్కోవాలంటే అగ్నిమాపక నిరోధ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.తేజ, అగ్నిమాపక సిబ్బంది మోహన్ జయకుమార్, కృష్ణయ్య, మునిప్రతాప్, నరేంద్ర, శ్రీనివాసులు, అమర్నాథ్లతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగి పట్ల చూపే మానవీయ దృక్పథమే
వైద్యుని అసలు గొప్పతనం :డాక్టర్ భరత్ సురేష్
- పిఇఎస్ వైద్య కళాశాలలో ఘనంగా 18వ స్నాతకోత్సవం...

కుప్పం–ఆంధ్రనాడు,ఫిబ్రవరి 27: వైద్య సేవల్లో సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, రోగి పట్ల చూపే మానవీయ దృక్పథమే వైద్యుని అసలు గొప్పతనమని అసిస్టెంట్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ భరత్ సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక పిఇఎస్ వైద్య కళాశాలలో 18వ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పిఇఎస్ వైద్య కళాశాల అసిస్టెంట్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ భరత్ సురేష్ అధ్యక్షతన, ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ విజయవాడ ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైద్య వృత్తిలో నైతిక విలువలు, కరుణ, అంకితభావం, జీవితాంతం నేర్చుకునే తత్వం అవసరమని పేర్కొన్నారు. ఆధునిక వైద్య సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, రోగి పట్ల చూపే మానవీయ దృక్పథమే వైద్యుని అసలు గొప్పతనమని అన్నారు.

డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ... స్నాతకోత్సవం అనేది కేవలం డిగ్రీ ప్రదానం మాత్రమే కాకుండా, కృషి, క్రమశిక్షణ, పట్టుదల మరియు సేవాభావానికి గుర్తింపని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలను బలోపేతం చేయడంలో యువ వైద్యులు ముందుండాలని సూచించారు. అనంతరం 167 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు, 95 మంది పీజీ (ఎండీ/ఎంఎస్) విద్యార్థులకు పట్టభద్రుల పత్రాలను ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా డా. వి. దుర్గా కి గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్.ఆర్ కృష్ణారావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.కె సుబ్రమణ్య, వైస్ ప్రిన్సిపల్ వి ఎస్ ఎస్ ఆర్ ర్యాలీ, అన్ని విభాగ అధిపతులు, అధ్యాపకులు, సిబంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్ల సేవే ధ్యేయం

రేణిగుంట– ఆంధ్రనాడు ,ఫిబ్రవరి 27 : రేణిగుంట రైల్వే క్యారేజీ రిపేరు వర్క్ షాప్ పెన్షనర్ల సేవే తన ధ్యేయమని పెన్షన్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎం .విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం రేణిగుంట పట్ట ణంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తాను పెన్షనర్లకు చేస్తున్న సేవ లను గుర్తించి జోనల్ వైస్ ప్రెసిడెంట్ గా జాతీయ నాయకత్వం నియమించడం పట్ల పెన్షనర్స్ అసోసి యేషన్ జనరల్ సెక్రటరీ ఆర్. ఎం విజయ్ కుమార్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ అఫీషియల్స్ ఆధ్వర్యంలో జోనల్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ విజయ్ కుమార్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసి యేషన్ కార్యదర్శి జయంత్ కుమార్, చైర్మన్ హసన్ సాహెబ్ లు ఆయనను ప్రత్యేకంగా సత్క రించారు. అదేవిధంగా స్థానిక డాక్టర్లు బ్రహ్మానందం, సురేంద్ర ఆయనను శాలువాలతో సన్మానించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే పెన్షనర్లకు గ్లూకో మీటర్లు (షుగర్ టెస్టింగ్ పరికరం) పంపిణీ చేశారు. ఆర్ఎం విజయ్ కుమార్ మాట్లాడుతూ తనకి ఈ పదవి రావడం పెన్షనర్స్ వల్లనే అని, ఈ పదవిని వారికే అంకితం చేస్తున్నానన్నారు. ఒక కార్యదర్శిగా పెన్షనర్స్ కు అందుబాటులో ఉంటూ పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై నిరసనలు, వైద్య శిబిరాలు నిర్వహించి సిఆర్ఎస్ బ్రాంచ్ ను డివిజనల్ జోనల్ స్థాయిలలో ముందుకు వెళ్లానన్నారు. ఏ ఐ ఆర్ ఆర్ ఎఫ్ జాతీయ నాయకులు శ్రీధర్ తమ సేవలను గుర్తించి జోనల్ కార్యవర్గంలో చోటు కేటాయించారని ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సి ఆర్ ఎస్ బ్రాంచ్ అధ్యక్షుడు కృష్ణదాస్ కార్యవర్గ సభ్యులు రామ్మూర్తి, జబ్బార్, రవీంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు బెదిరింపులు...
రైతు పురుగుల మందు తాగి ఆత్మ హత్యాయత్నం...
- నెలలుగా రైతు కుటుంబాన్ని వేదిస్తున్న టిడిపి నాయకులు...
- న్యాయశీ చేయాలని మహిళా ఆవేదన...

కార్వేటి నగరం – ఆంధ్రనాడు, ఫిబ్రవరి 27 : టిడిపి నాయకులు వేధింపులు తట్టుకోలేక రైతు ఆత్మహత్య చేసుఘటన కార్వేటినగరం మండలం దిగువ ఎర్రమరాజు పల్లి గ్రామంలో చోటుచేసుకుంది.కార్వేటి నగరశీ మండలం పరిధిలోని 63 స్పీటింగ్‌లో సర్వే నంబర్ 155/1,155/2 దిగువ ఎర్రమరాజు పల్లి రెవెన్యూ పరిధిలోని రైతు వెంకటాద్రిరెడ్డి, బంగారమ్మ అనే వీరికి కొంత వ్యవసాయ భూమి కలదు. వీరికి ఉన్న భూమితో పాటు కొంత డీకేటి భూమిని కూడా వీరు 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ ఉన్నారు.అయితే స్థానిక నాయకులు రైతు కుటుంబపై కక్షగట్టి దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపించారు. టిడిపి నాయకులు స్థానిక రైతు భూమిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు దీనిపై రెవెన్యూ అధికారుల శుక్రవారం సంఘటన స్థలానికి విచ్చేసి విచారణ చేపట్టారు. విచారణ సమయంలో రైతు పొలానికి వేసిన ఇనుప కంచెను తొలగించాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు.అయితే పక్కనే ఉన్న అక్రమాలకు పాల్పడిన వారిని భూమిలో కంచే ను కూడా తొలగించాలని స్థానిక రైతులు రెవెన్యూ అధికారులకు వాగ్వాదం జరిగింది.. ఇదే సమయంలో గ్రామానికి చెందిన టిడిపి నాయకులు హేమాద్రి రెడ్డి, నాదముని రెడ్డి రైతు కుటుంబంపై దురుసుగా ప్రవర్తిస్తూ దౌర్జన్యానికి పాల్పడినట్లు స్థానిక రైతులు తెలిపారు..తన 30 సెంట్లు భూమి రెవెన్యూ అధికారుల ఆదేశాలు మేరకు వదిలేస్తాము అని చెబుతున్నప్పటికీ రైతు మాటను వినకుండా టిడిపి నాయకులు తీవ్ర పదజాలంతో దూషించడంతో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని భార్య బంగారమ్మ తెలిపారు.వెంటనే పచ్చ కాఫలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స కొరకు తిరుపతి రుయా కు 108 ద్వారా తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు. తన భర్తను మనోవేదనకు గురిచేసి,వేదిస్తున్న హేమాద్రి రెడ్డి,నాదముని రెడ్డి,మరి కొందరి పై చర్యలు తీసుకోవాలని భార్యా బంగారమ్మ కోరారు. రైతు వెంకటాద్రి రెడ్డి తిరుపతి రుయా హాస్పిటల్ చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733